క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు



బీఎన్ కండ్రిగలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

బుచ్చినాయుడుకండ్రిగ: పెరటాశి నెల మొదటి శనివారాన్ని పురస్కరించుకుని నీర్పాకోట, కారణి, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామాల్లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు చేసి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పండరీ భజనలు చేశారు.

వైభవంగా ఊంజల్ సేవ



నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ వేదవల్లి సమేత శ్రీ వేద నారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెరటాసి నెల మొదటి శనివారం సందర్భంగా సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చి, ఊంజల్ సేవను వేడుకగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ-2

బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని.. వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని మండల విద్యాశాఖాధికారి-2 మునిసుబ్రమణ్య తెలిపారు. శనివారం మండలంలోని చెల్లమాంబాపురం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో అమలు అవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీపీ సింధూశ్యామ్

నాగలాపురం: మండల కేంద్రంలోని వేంబాక్కం, నాగలాపురం -1,2,3, గ్రామ సచివాలయాల్లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్షపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల జేసీఎస్ కన్వీనర్ బి.మోహన్ మొదలియార్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అపరంజిరాజు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోదన్నారు. వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నాగలాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై, జెడ్పీటీసీ మహేష్ రెడ్డి, ఎంపీపీ సింధూశ్యామ్, వైస్‌ఎంపీపీ ఉదయ్ కుమార్, సచివాలయ కన్వీనర్ ముత్తు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఆర్‌బీకే



వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు గ్రామ సచివాలయ పరిధిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. గ్రామస్థాయిలో ప్రభుత్వ సేవలను త్వరితంగా రైతులకు అందించేందుకు ఈ రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చారు. ఆ మేరకు రూ.21లక్షలతో చిన్న పాండూరు సచివాలయ ప్రాంగణంలో నూతన భవనాన్ని నిర్మించారు. అయితే ఈ భవనాన్ని అధికారికంగా ప్రారంభించాల్సి ఉంది.

పారిశుధ్య చర్యలు ముమ్మరం



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలో శనివారం సర్పంచ్ రమణమ్మ ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు ముమ్మరంగా చేపట్టారు. కాలువల్లోని మురుగు, పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. వీధుల్లో నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొగించి, బ్లీచింగ్ చల్లారు. తాగునీటి ఓవరు హెడ్ ట్యాంకును క్లోరినేషన్ చేయించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు వృద్ధికాకుండా మలాథీన్ పిచికారీ చేయాలని చెప్పారు. మురుగునీటి నిల్వ లేకుండా చేయటంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత

- పాండూరు హైస్కూల్లో ఎవర్టన్ టీ పరిశ్రమ అభివృద్ధి పనులు
- రూ. 35లక్షలతో మరుగుదొడ్లు, ఫెన్సింగ్ నిర్మాణం





పాండూరు హైస్కూల్లో ఎవర్టన్ టీ పరిశ్రమ నిర్మించిన మరుగుదొడ్లు, మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న ఎవర్టన్ ఎండీ (ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు హైస్కూల్ అభివృద్ధికి శ్రీసిటీ పారిశ్రామికవాడలోని ఎవర్టన్ టీ పరిశ్రమ చేయూతనిచ్చింది. పరిశ్రమకు సంబంధించి సీఎస్‌ఆర్ నిధుల ద్వారా రూ. 35లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. ఆ దశగా ఊరి బయట ఉన్న హైస్కూల్‌కు భద్రతా ఇబ్బందులు సంవత్సరాల తరబడి వెంటాడుతుండేవి. చుట్టూ ప్రహరీ లేని కారణంగా అనేక పర్యాయాలు రాత్రివేళల్లో కంప్యూటర్లు, విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. గేటు సౌకర్యం లేక సెలవు దినాల్లో మందుబాబులు పాఠశాలను తమ అడ్డాగా మార్చుకుని పాఠశాల ప్రాంగణంలో విచ్చలవిడిగా మద్యం సేవించడం, తాగిన బాటిళ్లను అక్కడే వదిలి వెళ్లేవారు. ఉదయం పాఠశాలకు రాగానే మొదటగా విద్యార్థులు మద్యం బాటిళ్లను తొలగించి తరగతి గదుల్లోకి వెళ్లాల్సిన దుస్థితి. ప్రధానంగా పాఠశాల ప్రాంగణంలో మరుగుదొడ్లు లేవు. దీని కారణంగా బాలికలు అనేక ఇబ్బందులు పడుతూ సమీపంలోని చెట్లపొదల మధ్యలోకి వెళ్తూ అసౌకర్యానికి గురయ్యేవారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల గురించి ఎవర్టన్ టీ పరిశ్రమ యాజమాన్యానికి పాఠశాల ఉపాధ్యాయ బృందం విన్నవించారు. స్పందించిన ఎవర్టన్ టీ పరిశ్రమ యాజమాన్యం పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి పేద ప్రజల పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలకు అండగా నిలిచింది.

రూ. 35లక్షలతో అభివృద్ధి పనులు

పాండూరు హైస్కూల్‌కు సంబంధించి శ్రీసిటీ ఎవర్టన్ టీ పరిశ్రమ 2022-23 సీఎస్‌ఆర్ నిధుల ద్వారా రూ. 35లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. రూ. 28లక్షలతో బాలురు, బాలికలకు వేర్వేరుగా అత్యాధునిక వసతులతో మరుగుదొడ్లను నిర్మించారు. అంతేకాక పాఠశాల భద్రత కోసం రూ. 200మీటర్ల మేరకు ఇనుప కంచె ఏర్పాటు చేశారు. పాఠశాలకు వెళ్లే ప్రధాన ముఖ ద్వారం వద్ద రూ. 2లక్షలతో ఆర్చీ, గేటును నిర్మాణం చేశారు. దీంతో పాఠశాలలో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కారమయ్యాయి.

ఎవర్టన్ చొరవ అభినందనీయం



పాఠశాల అభివృద్ధికి శ్రీసిటీ ఎవర్టన్ టీ పరిశ్రమ చేయూత అభినందనీయం. పాఠశాలలో బాలికలు మరుగుదొడ్ల కోసం అనేక ఇబ్బందులు పడేవారు. ఆ ఇబ్బందులు తొలగాయి. అంతేకాక పాఠశాలకు భద్రత లభించింది. నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా పనులను చేపట్టారు. వారి స్ఫూర్తి, చొరవను ఆదర్శంగా తీసుకుని అన్ని విధాలుగా విద్యార్థులు ముందుండే విధంగా చర్యలు తీసుకుంటాం. –విమలకుమారి, హెచ్‌ఎం, పాండూరు హైస్కూల్

పేద పిల్లలకు అండగా నిలిచాం



ప్రభుత్వ బడుల్లో విద్యను అభ్యసించే పేద పిల్లల ఇబ్బందులకు అండగా నిలిచామన్న సంతృప్తి ఉంది. పాఠశాల ఉపాధ్యాయ బృందం విన్నపం మేరకు పాండూరు హైస్కూల్‌లో పర్యటించి సమస్యలను అధ్యయనం చేశాం. మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు పాఠశాల భద్రతకు ప్రాధాన్యత నిచ్చి నిర్మాణాలు చేపట్టాం. విడతల వారీగా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తాం. – రోషన్ గుణవర్ధన్, ఎండీ, ఎవర్టన్ టీ పరిశ్రమ

పిల్లలందరూ బడిలోనే ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఈఓ శేఖర్

నారాయణవనం: బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో చదువుకోవాలని, వంద శాతం నమోదుకు కృషి చేయాలని డీఈఓ శేఖర్ సూచించారు. శనివారం మండల విద్యావనరుల కేంద్రంలో సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చదువుకు ప్రాధాన్యత ఇస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వంద శాతం పిల్లలందరూ బడికి హాజరుకావాలనే లక్ష్యంతో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే (జీఈఆర్)ను నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. సర్వే ఆవశ్యకతను వివరించి, వలంటీర్ల సాయంతో త్వరితగతిన పూర్తి చేసి బడికి దూరంగా ఉన్న పిల్లలను గుర్తించాలని సూచించారు. అనంతరం మండలంలో మన బడి నాడు-నేడు పనులపై ఎంఈఓలతో సమీక్షించారు. రెండో విడత నాడు-నేడు పనులను ప్రజా ప్రతినిధులతో చర్చించి పూర్తి చేయించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. సమావేశంలో ఎంఈఓలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి పాల్గొన్నారు.

ముగిసిన 67వ స్కూల్‌గేమ్స్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



యోగా చేస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం 67వ స్కూల్‌గేమ్స్ పోటీలు ముగిశాయి. శుక్ర, శనివారాల్లో నియోజకవర్గస్థాయి పోటీల్లో అండర్-17, అండర్-14 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట నుంచి దాదాపు 550 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భువనేశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పీవీ రమణ, కార్యదర్శులు జేమ్స్, వెంకటముని పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణం, మండలంలో మరణించిన పలు పేద కుటుంబాలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటమ్మ(తుఫాన్ సెంటర్, కన్నమ్మ(ప్రాజెక్టువీధి)కి చెందిన వారు అనారోగ్యంతో మృతి చెందారు. వీరి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి ద్వారా కుటుంబానికి రూ.10వేలు చొప్పున అందజేశారు. భాస్కర్‌పేటకు చెందిన ఇ.శ్రీనివాసులు, ముత్తరాశిపాళెంకు చెందిన వలంటీరు ఎం.శ్రీనివాసులు మృతి చెందారు. వారి కుటుంబాలకు రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో తెలంగాణ మంత్రి



ప్రిన్సిపల్ సెక్రటరీకి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు



మంత్రి మల్లారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం తెలంగాణ మంత్రి మల్లారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆయనకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు వేద ఆశీర్వచనం అందించారు. అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ధర్మాదాయ, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వలవన్ కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆయనకు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే తనయుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు బుల్లెట్ జయశ్యామ్, పసల సుమతి, ఆలయ అధికారులు సతీష్‌మాలిక్, ధనపాల్, హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



నారాయణవనంలో అవగాహన ర్యాలీ

నారాయణవనం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్య జీవనం సాధ్యమని ఈఓ పీఆర్‌డీ డాక్టర్ వేణయ్య, పంచాయతీ ఈఓ షణ్ముగం అన్నారు. శనివారం నారాయణవనంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా చెత్తబుట్టల్లో ఉంచి, పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. వర్షా కాలం నేపథ్యంలో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని.. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. జ్వరం, దగ్గు, జలుబును ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ర్యాలీలో పారిశుద్ధ్య కార్మికులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



కొత్త సైకిళ్లతో విద్యార్థులు

శ్రీకాళహస్తి: మండలంలోని చుక్కలనిడిగల్లు ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో గ్లోబల్ కంపేర్షన్ సంస్థ ద్వారా 20మంది విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. తొండమనాడు పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఆ సంస్థ ప్రతినిధి జోసెఫ్ సైకిళ్లను పంపిణీ చేశారు. దీనికి జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎస్ శివశంకరయ్య విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యా సామగ్రి, సైకిళ్లను పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, తొండమనాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, గ్లోబల్ ప్రతినిధులు సుందర్‌రాజు, భాస్కర్, ప్రసాద్, విక్రమ్, ప్రదీప్ పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల్లో కోలాటాల సందడి



వరదయ్యపాళెం: మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా నిలుస్తున్నాయి. రాచర్లలో శనివారం రాత్రి కళాకారుల కోలాటాలు ఆకట్టుకుంది. స్థానికంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల పాట కచ్చేరిలు, నృత్య ప్రదర్శనలు చేస్తున్నారు.

పాపానాయుడుపేటలో అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఏర్పేడు: వినాయచవితి ఉత్సవాలలో భాగంగా శనివారం పాపానాయుడుపేట కంచుకోట వీధిలో భక్తులకు అన్నదానం చేశారు. రాయల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా శనివారం వినాయక స్వామి విగ్రహానికి విశేషాలంకరణ చేసి పూజలు చేశారు. మధ్యాహ్నం 700 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు కరుణాకరణ్, ఎస్ఎస్‌చంద్ర పాల్గొన్నారు.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు



బుచ్చినాయుడికండ్రిగ: మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీలో వీధిదీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతుంది. దీపాలు తొందరగా పాడైపోతున్నాయి. వీధి దీపాలకు ఆన్/ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేయకపోవడంతో ఈ సమస్య ఎదురవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్విచ్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జాబ్‌కార్డున్న వారందరికీ పనులు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస ప్రసాద్

ఏర్పేడు: ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డు కల్గిన ప్రతి కుటుంబానికి పనులు కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మండలంలోని ఆమందూరు పంచాయతీలో శనివారం ఉపాధి హామీ కింద జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. కూలీల మస్టర్లు పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పనులు కల్పించడం ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెరుగుతాయని సూచించారు. ఉపాధి హామీ పథకం పేదలకు ఒక వరమన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన రైతులను గుర్తించి వారి పొలాల్లో పండ్లు, పూలు, మునగ తోటల పెంపకం చేపట్టాలని చెప్పారు. ఉపాధి హామీలో పంట, వరవ, నీటి గుంతల తవ్వకం తదితర పనులను చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో విరివిగా కూలీలకు పనులు కల్పించాలని వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, జేఈ బాలాజీరావు, సాంకేతిక సహాయకుడు రవీంద్రుడు, క్షేత్ర సహాయకుడు చంద్రయ్య, కూలీలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో వంటకాల పోటీలు



మాట్లాడుతున్న ఆత్మ డీడీ రత్న ప్రసాద్

పిచ్చాటూరు: చిరుధాన్యాలతో వివిధ రకాల వంటకాలు అనే అంశంపై మహిళా రైతులకు రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం పోటీలు నిర్వహించారు. ముడియూరు ఆర్‌బీకేలో జరిగిన పోటీల్లో ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ రత్న ప్రసాద్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించామన్నారు. పోటీల్లో 30 మంది రైతులు పాల్గొని రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాసులు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ నలినాక్షిలు వంటకాలను పరిశీలించారని చెప్పారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 6 మంది మహిళా రైతులను ఎంపిక చేసి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. చిరుధాన్యాలతో చేసిన వంటకాలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.శ్యామల, వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీలత పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహారావు

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని.. రోజుకు 5 వేల మంది పనిచేసేలా చూడాలని ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. శనివారం ఉపాధి హామీ ఏపీఓ భానుప్రియ, సిబ్బందితో ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు నీరు, నీడ సౌకర్యాలతోపాటు ప్రథమ చికిత్స బాక్స్ ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కూలీలకు రోజుకు రూ. 272 వచ్చేలా పనులు కల్పించాలని సూచించారు. ప్రతి పంచాయతీలో పండ్ల తోటల పెంపకం వైపు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇందు కోసం నేలాఖరులోపు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఏఓ త్రివిక్రమ్‌రావు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల ప్రతిభ



పోటీలకు ఎంపికైన వారిని అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో నారాయణ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అండర్-14, అండర్-17 విభాగంలో ఎంపికయ్యారు. వీరిలో ఎం.జశ్వంత్, ఎం.వినయ్, ఎస్.హేమంత్ ఉన్నారు. వీరిని నారాయణ యాజమాన్యం తరఫున అకడమిక్ డీన్ రాము, పీఈటీ హుస్సేన్, ఉపాధ్యాయులు అభినందించారు.

కనుల పండువగా రాధాష్టమి వేడుకలు

తిరుపతి కల్చరల్: ఇస్కాన్ మందిరంలో శనివారం శ్రీకృష్ణ భగవానుని ఇష్టసఖి రాధాదేవి జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి తర్వాత 18వ రోజు రాధాష్టమి వేడుకలు నిర్వహించడం ఆవాయితీ. ఇందులో భాగంగా తిరుపతి ఇస్కాన్‌లోని శ్రీరాధాగోవింద కమల మందిరంలో ఉదయం 8.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు రాధాగోవిందులకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు రాధాగోవిందుల ఉత్సవమూర్తులకు మహా శంఖాభిషేకం చేపట్టారు. 12.30 నుంచి 1.30 గంటల వరకు రాధారాణి లీలలపై ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతిరమణదాస్ ప్రత్యేక ప్రవచనం చేశారు. భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. ఇస్కాన్ మందిరం కార్యదర్శి లీలాపారాయణదాస్, రూపేష్ ప్రభు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న రాధాగోవిందులు, పూజల్లో పాల్గొన్న భక్తులు